


సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
సోమవారం 14-4-2025
సంపుటి: 21 సంచిక: 17
పేజీలు: 8 వెల: రూ.1

## పేరుకు సర్కారీ ఉద్యోగం
# చేసేది పార్టీ ఊడిగం!

ఆయన ఒక ప్రభుత్వ ఉద్యోగి. సర్వీస్ రూల్స్ పాటిస్తూ విధులు నిర్వర్తించాల్సిన ఆయన ఉద్యోగాన్ని గాలికొదిలేసి రాజకీయ పార్టీ సేవలో తరిస్తున్నాడు. ఇంకా చెప్పాలంటే ఆ పార్టీ కార్యకర్తగా చెలామణీ అవుతున్నాడు. చిత్రమేమిటంటే గత ఏడాది వరకు అధికారంలో ఉన్న వైకాపాకు కొమ్ముకాసిన ఇతగాడు.. ఆ పార్టీ అధికారం కోల్పోయినా ఇప్పటికీ దాన్నే అంటిపెట్టుకుని ఉంటూ ఉద్యోగానికి ఎగనామం పెడుతున్నాడు. సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా రాజకీయ కార్యకలాపాలు సాగిస్తున్న సదరు ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని సాక్షాత్తు ఎమ్మెల్యే లేఖ రాసి నెలలు గడుస్తున్నా దిక్కు లేదు. ఉన్నతాధికారులే ఆ రాజకీయ ఉద్యోగిని కాపాడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- ఐసీటీసీ కౌన్సిలర్ రాజకీయ విధులు
- అప్పుడూ.. ఇప్పుడూ వైకాపా సేవలో తరిస్తున్న ఘనుడు
- పలాస ఎమ్మెల్యే ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం
- రాష్ట్ర కార్యాలయంలో ఉన్న మద్దతే కారణం

డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి



సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా..

వజ్రపుకొత్తూరు మండలం చినవంక పంచాయతీ పరిధిలోని గుల్లలపాడు గ్రామానికి చెందిన బగాది శ్రీకాంత్ పలాసలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో పని చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ(ఏపీశాక్స్) విభాగంలో ఐసీటీసీ కౌన్సెలర్ అయిన ఈయన ఆ హోదాలో పలాస సీహెచ్‌సీలో విధులు నిర్వర్తిస్తున్నారు. పేరుకు ఈయన ప్రభుత్వ ఉద్యోగి అయినా ఆ విధుల కంటే రాజకీయ పార్టీ సేవలోనే ఎక్కువ కాలం గడుపుతుంటారు. ఇది ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ రూల్స్‌కు పూర్తి విరుద్ధమని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏడాది క్రితం వరకు అధికారంలో ఉన్న వైకాపా కార్యకర్తగా పనిచేస్తూ విధులకు డుమ్మా కొట్టడం ఈయనకు - మిగతా చివరి పేజీలో

# వీడిన నిద్ర.. ప్రతిపక్ష ముద్ర






- డీసీసీబీ కాలనీ ఆక్రమణలపై సమష్టి విజయం
- అధికార పార్టీ నుంచీ అందిన సహకారం
- కోర్టు ఆదేశాలున్నా ప్రహరీ కూల్చేసిన కార్పొరేషన్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అధికారంలో ఉన్నప్పుడు పథకాల రూపంలో డబ్బులు పంచినా ప్రజలకు చేరువ కాలేకపోయిన వైకాపా, ఇప్పుడు ప్రతిపక్షంగా కూడా పని చేయడంలేదన్న విశ్లేషకుల అభిప్రాయం తప్పని శ్రీకాకుళం వైకాపా నాయకులు నిరూపించారు. ఈ జిల్లాకు పెద్ద దిక్కయిన ధర్మాన ప్రసాదరావు మౌనమునిగా మారడంతో శ్రీకాకుళంలో ఆ పార్టీకి రెక్కలు తెగిపోయాయన్న భావనకు ఫుల్‌స్టాప్ పెట్టారు. ధర్మాన రోడ్డెక్కకపోయినా, తెర వెనుక మంత్రాంగం నడుపుతున్నారని పార్టీకి, సిక్కోలు నియోజకవర్గానికి తెలియజెప్పే ఉదాహరణే ఇది. కొద్ది రోజుల క్రితం పొట్టి శ్రీరాములు పెద్దమార్కెట్‌ను కొట్టేస్తామని టీడీపీ నేతలు ప్రకటించడంతో ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించిన వైకాపా నేతలు అదే వేగంతో డీసీసీబీ కాలనీలో 80 అడుగుల రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారంటూ టీడీపీ నేతలకు, స్థానిక ఎమ్మెల్యేకు చెప్పినా ఫలితం దక్కలేదని ఆందోళన చేయడంతో ఈ కేసును వైకాపా నేతలు టేకప్ చేసి విజయం సాధించారు. స్థానికంగా జరుగుతున్న ఆందోళనకు మద్దతు తెలిపి దీనికి రాజకీయ ప్రాధాన్యతను తీసుకురావడం వల్ల డీసీసీబీ కాలనీలో గత కొద్ది రోజులుగా జరుగుతున్న - మిగతా చివరి పేజీలో



హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు






• ఎడిటోరియల్

# మార్కుల కోసం మాతృభాష బలి

విద్యావ్యాపారాల్లో మార్కులు, ర్యాంకులు, ఆదాయాలు, లాభాలు వంటి వాటికన్నా మానవీయ శాస్త్రాలు ఎక్కువెలా అవుతాయి ఈ మార్కెట్ చదువుల మాయలో! మాతృభాషలు, సాంస్కృతిక వారసత్వాలు అన్నీ విలవిల్లాడాల్సిందే ఆ మోహంలో! ఎంత తడి ఆరిపోతేనేం.. పొడిపొడిగా మార్కులు రాలిపడితేచాలు. వాటితో ర్యాంకులు ప్రకటనల బోర్డులపై మెరుస్తాయి. మైమరపిస్తాయి. గత కొన్ని దశాబ్దాలుగా ఇంటర్‌విద్యలో ప్రైవేటు మార్కెట్ భూమ్ వైపరీత్యాలను చూస్తూనే మౌనంగా ఉంటున్నాం. 'చైనా' విజృంభణలో తెలుగు'వాడి' పోయింది.. సోయి తప్పికొట్టుకుపోయింది.. పోతున్నదీ కూడా మనందరికీ తెలుసు. ఆ వేగంలో పడి, వలలో పడి ఎన్ని పోగొట్టుకున్నాం? ఎన్ని జీవితాల్ని తాకట్టు పెట్టుకున్నాం, ఆస్తుల్ని పోగొట్టుకున్నాం, ఆఖరికి మన పిల్లల్నీ పోగొట్టుకోలేదూ! దూరాలకు పోగొట్టుకుని దుఃఖాలకు బలిపెట్టు కోలేదూ! అయినా ఏదో ఒక ప్రవాహానికి కొట్టుకుపోవటం తప్ప, నిలబెట్టుకోవటంలో తెలుగువాడి వాడి పెద్దగా కనపడదు. ఇప్పుడదే ప్రభుత్వ బుర్రలోకి ప్రవేశించి తొలుస్తున్నట్టు తెలుస్తోంది. మాతృభాషలను ప్రోత్సహించాలని, కాపాడుకోవాలనీ సభల్లో గంభీరోపన్యాసాలు దంచే ప్రభుత్వ పెద్దలు అందుకు భిన్న ఆలోచనలు చేయటం నేటి విపరీతం. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ద్వితీయ భాషగా తెలుగుకు బదులుగా సంస్కృతాన్ని తెచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు మొదలు పెట్టింది. అన్ని కళాశాలల ప్రధానాచార్యులకు లేఖలు రాసి వివరాలు సమర్పించమని విద్యాశాఖ సంచాలకులు కోరారు. ప్రైవేటు కార్పొరేటు కళాశాలలతో పోటీ పడే నెపంతో తెలుగును కనుమరుగు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వీటి ద్వారా అర్థమవుతున్నది. ఒకవైపు జాతీయ విద్యా విధానం పేరిట దక్షిణాదిపై హిందీ భాషను రుద్దే ప్రయత్నం కేంద్రం చేస్తుంటే, ఇపుడు మన చేతులతో మనమే తెలుగు భాషను యువతరానికి దూరం చేసే పనికి పూనుకోవటం అత్యంత బాధాకరం. ఇప్పటికే రాష్ట్రంలోని కార్పొరేట్ కళాశాలల్లో ద్వితీయ భాషగా సంస్కృతం అమలవుతున్నది. ప్రైవేటు కళాశాలల్లో చదివే పిల్లలందరూ ద్వితీయ భాషగా సంస్కృతాన్నే పరీక్షల్లో రాస్తున్నారు. ఎందుకంటే చదువుతున్నారని అనకూడదు. దానికి ఒకే ఒక్క కారణం మార్కులు అత్యధికంగా రావటం. ఇదేమీ భాషపైన ప్రేమతో, అభిమానంతో నేర్చుకోవాలన్న జిజ్ఞాసతో సంస్కృతాన్ని వాళ్లు చదవటం లేదు. కళాశాలలు బోధించడమూ లేదు. సంస్కృతం రాస్తే మార్కులు 100కు 90 నుంచి 99 వరకు వస్తాయి. అది కూడా ఏం రాసీ రాయకున్నా, చూసీ చూడనట్లుగా మార్కులు పడిపోతాయి. అదే తెలుగు ద్వితీయ భాష అయితే అలా మార్కులు రావటం చాలా కష్టం. రావు కూడా. పోనీ వీళ్లకు సంస్కృత అధ్యాపకులు బోధన చేస్తారా? అంటే ఏమాత్రం కాదు. మెటీరియల్ అందించి బట్టీ పట్టిస్తారంతే! ఒకటి నుంచి పదో తరగతి వరకు తెలుగు చదువుకుని, సంస్కృతం ఒక్క ముక్క తెలియని వారు ఇంటర్‌లోకి రాగానే ఎకాఎకి సంస్కృతం తీసుకుని రాయడమేమిటి? ఇదొక అశాస్త్రీయ పద్ధతి. ఆ తర్వాత కానీ, వాడుకలో కానీ ఏమీ ఉపయోగం లేని భాషను కేవలం మార్కుల కోసం చదవటం, అందుకు ప్రభుత్వమూ పూనుకోవటం అజ్ఞానపు చర్య. మాతృభాషను నేర్చుకోవాలని, అధ్యయనం చేయాలని కోరుకోవటంలో కేవలం అభిమానం మాత్రమే కారణం కాదు. మాతృభాష మన నుంచి దూరమైతే, మన సంస్కృతి సంప్రదాయాల నుంచీ, బంధాలు, అనుబంధాల నుంచీ దూరమవుతాం. ఒక మానవీయ స్పర్శ నుంచీ దూరమవుతాం. మాతృభాష ద్వారానే తార్కిక ఆలోచనలు పెంపొందుతాయి. మానసిక వికాసమూ అభివృద్ధి చెందుతుంది. సృజనాత్మక దృష్టీ పెరుగుతుంది. అందుకనే తెలుగును నేర్చుకోవాలి. బతికించుకోవాలి. మొదటి నుంచీ ఆంగ్ల మాధ్యమంలో చదువుతూ తెలుగును నిర్లక్ష్యం చేసి, కళాశాల చదువులోనూ ఏదో మార్కుల కోసం సంస్కృతం చదివి, ఏ భాషనూ పూర్తిగా పట్టుకోలేక రెంటికి చెడ్డ రేవడిలా విద్యార్థులు మారిపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలోనూ ఈ రకమైన ఆలోచనను ఒకసారి చేశారు. అప్పుడు విమర్శలు తలెత్తడంతో ఆగిపోయింది. తెలుగు భాషకు ప్రాధాన్యతనిస్తామని ప్రకటించిన ప్రస్తుత ప్రభుత్వమూ ఈ చర్యలకు పూనుకోవడం సరైనది కాదు. అనేకమంది భాషా సాహిత్యకారులు, సామాజిక సంఘాలు, మేధావులు తెలుగును ఎత్తేసే ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇదేదో హిందీ, సంస్కృత భాషలపై ఉన్న వ్యతిరేకతతో చెబుతున్నది కాదు. మాతృభాషను విడిచి మార్కుల కోసం మరో భాషను నేర్పాలని చేసే ప్రయత్నం శాస్త్రీయమూ కాదు, సమంజసమూ కాదు. ప్రభుత్వం వెంటనే ఇలాంటి మాతృభాషా వ్యతిరేక చర్యలను మానుకోవాలి.



ఐఐఐటీ క్యాంపస్‌లో సోమవారం నిర్వహించిన అంబేద్కర్ జయంతిలో డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెద్దింటి ముకుందరావు, వి.సింహాచలంలు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, ఎచ్చెర్ల




నగరంలో గల కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల్లో డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.శివశంకర్, వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, ఎన్ఎస్ఎస్ పిఒ ఎల్.మోహనరావు తదితరులున్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం.

## సంతోషిమాతకు ప్రత్యేక పూజలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



శ్రీకాకుళంలో కొలువైన శ్రీ సంతోషిమాత ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం కిరణ్‌శర్మ మాట్లాడుతూ అమ్మవారి జన్మనక్షత్రం స్వాతి అయినందున అమ్మవారికి సుప్రభాత సేవ, క్షీరాభిషేకం తదితర పూజలను నిర్వహించామన్నారు.

ఉపాధిహామీ కూలీలకు

## ప్రథమచికిత్స కిట్లు అందజేత

(సత్యంన్యూస్, గార)

మండలంలోని వాడాడ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై పనిచేస్తున్న కూలీలకు సోమవారం ప్రథమచికిత్స కిట్లను సర్పంచ్ సుంకాన సురేష్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉపాధి హామీ పథకంపై యాబైజీఖాన్ చెరువువద్ద పనిచేస్తున్న కూలీలకు వాటర్ బాటిల్స్ అందించామన్నారు. వేసవిలో తగినన్ని నీళ్లు శరీరానికి అవసరమన్నారు. అలాగే వీరి పనులలో భాగంగా అత్యవసరంగా ఏదైనా ప్రమాదానికి గురైతే తక్షణ ప్రథమ చికిత్స నిమిత్తం కిట్లను అందించామన్నారు. వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్త వహించాలన్నారు. వీలైనంత వరకు ద్రవ పదార్థాలను తీసుకోవాలని సూచించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతీ కూలీకి 100రోజులు పని కల్పించి, కనీసవేతనాలను అందిస్తున్నామన్నారు. వేతనదారులు సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ కూలీలతోపాటు, ఫీల్డ్ అసిస్టెంట్ సింధు, శారద, గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, గ్రామస్థులు జగదీశ్, పద్మరాజులు పాల్గొన్నారు.



## స్టేట్ ర్యాంక్ సాధించిన ధరణికి అభినందన వెల్లువ



(సత్యంన్యూస్, పలాస)

వజ్రపుకొత్తూరు మండలం ఉద్దాన గోపీనాథపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కర్ని వల్లయ్య మనవరాలు కర్ని ధరణి బూర్జ గ్రామంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ చదువుతూ శనివారం విడుదలైన ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 984 మార్కులు సాధించినందుకు గానూ అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈమేరకు ఆదివారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష టీడీపీ నాయకులతో కలిసి ఆమెను అభినందించారు.



టెక్కలి ఆదిఆంధ్రావీధిలో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో సీపీఎం నాయకులు నంబారు లక్ష్మణరావు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొల్లి యల్లయ్య, యర్ర వెంకట్రావు, యాగాటి శివరావు, పినిమింటి రామారావు, దాసరి రవిబాబు, జోగి ధర్మారావు, యర్ర కొండలరావు, అప్పయ్య, ఉమా, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, టెక్కలి

## గ్రంథరూపంలోకి 75 ఏళ్ల శ్రీకాకుళం చరిత్ర

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా ఏర్పడి ఆగస్టు 15 నాటికి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా, చరిత్ర, సంస్కృతులకు సంబంధించిన ఒక వ్యాస సంపుటిని తీసుకురావాలని ఇంటాక్ సంస్థ నిర్ణయించింది. ఆదివారం రెడ్‌క్రాస్ భవన సమావేశ మందిరంలో ఈ నిర్ణయంలో భాగంగా, సంస్థ కన్వీనర్ వావిలపల్లి జగన్నాథనాయుడు అధ్యక్షతన ప్రాథమిక సమావేశం జరిగింది. వివిధ రంగాలలో అనుభవం గల రచయితలతో వ్యాసాలను రాయించాలని సమావేశం నిర్ణయించింది. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి దీనికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను సమర్పిస్తామని, ఆయన సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని కో–కన్వీనర్ నూక సన్యాసిరావు చెప్పారు. సమావేశానికి హాజరైన ప్రముఖులంతా, గ్రంథ రచనకు అవసరమైన సూచనలు చేశారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యదర్శి పి.జగన్మోహనరావు, జర్నలిస్ట్, చరిత్ర పరిశోధకులు నల్లి ధర్మారావు, విశ్రాంత ప్రిన్సిపల్ సనపల ఈశ్వరరావు, విద్యావేత్త డాక్టర్ నిక్కు అప్పన్న, నామ శాస్త్ర పరిశోధకులు వాండ్రంగి కొండలరావు, డిగ్రీ కళాశాల లెక్చరర్ బెందాళం వరలక్ష్మి, రంగస్థల కళాకారుల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు ఎల్ రామలింగస్వామి, జర్నలిస్ట్ సంఘం నాయకులు ఎన్ ఈశ్వరరావు సమావేశానికి హాజరయ్యారు. కొద్ది రోజుల్లో మరి కొంతమందిని కూడా ఆహ్వానించి జిల్లా చరిత్ర, సంస్కృతి వ్యాసాల సంకలనాన్ని సమగ్రంగా తీర్చిదిద్దడానికి ఆహ్వానిస్తామని జగన్నాథంనాయుడు తెలిపారు.







**కథ:**

**ఓ పల్లెటూరిలో ఎన్నో ఏళ్ల తర్వాత పుట్టిన ఓ అమ్మాయి పుడుతుంది. తనే రాజకుమారి (దీపిక పిల్లి). తన రాకతో ఊరికి అదృష్టం పట్టిందని ఆమెను చాలా ప్రత్యేకంగా చూస్తారందరూ. ఆ అదృష్టం ఊరు దాటి పోకూడదని.. తన కంటే ముందు పుట్టిన 60 మంది అబ్బాయిల్లో ఎవరో ఒకరిని పెళ్లి చేసుకోవాలని ఊరి పెద్దలు నిర్ణయిస్తారు. ఇందుకు రాజకుమారి తండ్రి అంగీకరిస్తాడు. దీంతో అపట్నుంచి ఆ 60 మంది అబ్బాయిలు.. చిన్నతనం నుంచే రాజకుమారి మనసు గెలవాలని గట్టిగా ప్రయత్నిస్తుంటారు. ఊరిలోకి బయటి అబ్బాయిలెవరినీ రానివ్వరు. అలాంటి పరిస్థితుల్లో ఆ ఊరికి ఒక ప్రాజెక్ట్ పని మీద వస్తాడు ఇంజినీర్ కృష్ణ (ప్రదీప్ మాచిరాజు). కొన్ని రోజులకు కృష్ణ-రాజకుమారి ప్రేమలో పడతారు. ఊర్లో వాళ్లకు విషయం తెలియకుండా దాచిపెట్టిన ఈ జంట.. తర్వాత అందరికీ దొరికిపోతుంది. మరి ఊరి కట్టుబాటును దాటి ఈ జంట ఎలా ఒక్కటైంది? ఈ క్రమంలో ఎదురైన అడ్డంకులేంటి? వాటిని ఎలా పరిష్కరించుకున్నారు? అన్నది మిగతా కథ.**

**సాంకేతిక వర్గం:**

రధన్ సంగీతం సినిమాకు ప్లస్సే. చార్ట్ బస్టర్ సాంగ్స్ ఇవ్వలేదు కానీ.. సినిమాలో పాటలు బాగానే కుదిరాయి. నేపథ్య సంగీతం కూడా ఓకే. బాల్ రెడ్డి ఛాయాగ్రహణం సినిమాకు పెద్ద అసెట్. ప్రథమార్ధంలో పల్లెటూరి నేపథ్యంలో సన్నివేశాలను చాలా అందం గా చిత్రీకరించారు. ఆర్ట్ వర్క్ కూడా సింపుల్‌గా ఆకట్టుకుంది. ప్రొడక్షన్ వాల్యూస్ సినిమాకు అవసరమైన స్థాయిలో ఉన్నాయి. సందీప్ బొల్ల కథ సింపుల్. కానీ దాన్ని తెరపై ప్రెజెంట్ చేసిన తీరు బాగుంది. తన డైలాగులు ట్రెండీగా.. ఫన్నీగా అనిపిస్తాయి. కామెడీ సీన్లలో పంచులు బాగున్నాయి. నితిన్–భరత్ కథనం సినిమాకు ప్లస్. కొత్త వాళ్లే అయినా కన్ఫ్యూజన్ లేకుండా నీట్ గా సినిమా తీశారు. ప్రథమార్ధంలో ఉన్న జోరు.. ఫన్.. ద్వితీయార్ధంలో కూడా కొనసాగించి ఉంటే 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' స్పెషల్ ఫిలిం అయ్యేది.

యాంకర్‌గా మంచిపేరు సంపాదించిన ప్రదీప్ మాచిరాజు.. ఇప్పటికే '30 రోజుల్లో ప్రేమించడం ఎలా' అనే సినిమాలో హీరోగా నటించాడు. అది ఓ మోస్తరు ఫలితాన్నందుకుంది. మళ్లీ ఇప్పుడు 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు ప్రదీప్. కొత్త దర్శకులు నితిన్–భరత్ రూపొందించిన ఈ చిత్ర విశేషాలేంటో చూద్దాం పదండి.

# టైంపాస్ వినోదం!

**కథనం-విశ్లేషణ:**

అన్ని రసాల్లోకి కామెడీని పండించడమే అత్యంత కష్టమైన విషయం అంటారు ఫిలిం మేకర్స్. మిగతా రసాలు పండించడానికి కొన్ని టెంప్లేట్స్ ఉంటాయి.. వాటిని రిపీట్ చేసినా ఇబ్బంది ఉండదు. కానీ.. కామెడీ మాత్రం ఎప్పటికప్పుడు కొత్తగానే ఉండాలి. ఒకసారి నవ్వించే జోక్ రెండోసారి వేస్తే అది నవ్వుల పాలు అయిపోతుంది. అందులోనూ జబర్దస్త్ లాంటి షోలు కామెడీ స్వరూపాన్నే మార్చేసి బుల్లితెర మీదే ప్రేక్షకులకు బోలెడంత వినోదాన్ని అందిచేస్తుండడంతో.. సినిమా ద్వారా నవ్వించడం పెద్ద సవాలుగా మారిపోయింది. దీంతో కామెడీ రాసే.. తీసే సినీ రచయితలు-దర్శకులు అంతకంతకూ తగ్గిపోతున్నారు. ఇలాంటి సమయంలోనూ అప్పుడప్పుడూ కొన్ని చిత్రాలు ప్రేక్షకులను నవ్వించగలుగుతున్నాయి. ఛలో.. సామజవరగమన.. మ్యాడ్.. లాంటి చిత్రాలు ప్రేక్షకులకు కావాల్సినంత వినోదాన్నందించి బాక్సాఫీస్ దగ్గర జయకేతనం ఎగురవేశాయి. కథలో చమత్కారంగా అనిపించే ఒక పాయింట్ తీసుకుని.. దాని చుట్టూ ట్రెండీగా అనిపించే కామెడీ సీన్లు రాసుకుని ప్రేక్షకులను మెప్పించడం వీటిలో కామన్ గా కనిపించే పాయింట్. 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' అనే పవన్ కళ్యాణ్ సినిమా టైటిల్ పెట్టుకున్న ప్రదీప్ మాచిరాజు చిత్రంలోనూ దర్శక రచయితలు అదే బాటను అనుసరించారు. బోర్ కొట్టకుండా ఓ రెండు గంటలు ప్రేక్షకులను కుదురుగా కూర్చోబెట్టగలిగారు. కొన్ని బలహీనతలున్నప్పటికీ టైంపాస్ వినోదానికి ఢోకా లేని సినిమా ఇది.

కామెడీ ప్రధానంగా సాగే చిన్న సినిమాల్లో ఏదైనా టిపికల్‌గా అనిపించే ఓ పాయింట్ ఉంటేనే ప్రేక్షకులను ఎంగేజ్ చేయడానికి వీలుంటుంది. 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' టీం అలాంటి పాయింటే ఎంచుకుంది. అనగనగా ఓ పల్లెటూరు. ఆ ఊరిలో వరుసగా 60 మంది అబ్బాయిలు పుడితే.. లేక లేక పుట్టిన ఓ కుటుంబంలో పుట్టిన అమ్మాయిని అదృష్ట దేవతగా భావించి ఆమెను ఆ ఊరిలోని అబ్బాయినే తను పెళ్లి చేసుకోవాలని కట్టుబాటు పెడితే.. సిటీ నుంచి వచ్చిన అబ్బాయితో ఆమె ప్రేమలో పడడం.. ఈ క్రమంలో ఎదురయ్యే సమస్యల నేపథ్యంలో నడిచే కథ ఇది. 'ఛలో' సినిమాను గుర్తు చేసేలా ఉన్న ఈ కాన్ఫ్లిక్ట్ పాయింట్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. కామెడీ స్టైల్ చూసినా కూడా 'ఛలో' సినిమానే చాలా చోట్ల గుర్తుకు తెస్తుందీ సినిమా. కానీ కామెడీ సీన్లన్నీ ఆర్గానిగ్గా అనిపిస్తూ ప్రేక్షకులకు మంచి వినోదాన్ని అందిస్తాయి. ఆ ఒక్క అమ్మాయిని ఇంప్రెస్ చేయడానికి 60 మంది అబ్బాయిలు పడే పాట్లు.. బయటి అబ్బాయిల కళ్లు తన మీద పడకుండా వీళ్లు పెట్టే కండిషన్లు ఫన్నీగా అనిపిస్తాయి. హీరో పరిచయం తర్వాత త్వరగా ఈ కథ పల్లెటూరి బాట పడుతుంది. అక్కడ్నుంచే కథనం కూడా ఊపందుకుంటుంది. ఇటు కామెడీ సీన్లు.. అటు లవ్ ట్రాక్ రెండూ హుషారుగా సాగడంతో ప్రథమార్ధం వేగంగా సాగిపోతుంది. సత్య-గెటప్ శీను జోడీ నాన్ స్టాప్ కామెడీతో ప్రేక్షకులను ఎంగేజ్ చేస్తుంది. కామెడీలో వీరి బలం తెలిసిన వీరి కాంబినేషన్లో మంచి సీన్లు రాసుకున్నారు. అవే సినిమాకు హైలైట్. ఒక సీన్లో ఇద్దరూ భయంతో పాస్ పోసుకుంటే.. సత్య–శీను "పాణీ అదిగో పానీ".. "బిలాల్.. అదిగో జలాల్" అని చెప్పే డైలాగ్స్ కడుపు చెక్కలు చేస్తాయి. ఇలాంటి పంచ్ డైలాగ్స్ సినిమాలో చాలానే ఉన్నాయి. ఊరి కట్టుబాటుకు విరుద్ధంగా హీరోయిన్–హీరో ప్రేమలో పడి అందరికీ దొరికిపోయే సన్నివేశంతో విరామ సమయానికి కథ రసకందాయంలో పడుతుంది. హీరోకు ఎదురయ్యే రివర్స్ కండిషన్ తో ద్వితీయార్ధంలో ఈ కథను ఎలా ముందుకు తీసుకెళ్తారనే ఆసక్తి పుడుతుంది. కానీ అక్కడ్నుంచి మాత్రం అనుకున్నంత హుషారు కనిపించదు. రైటింగ్ పరంగా ప్రథమార్ధంలో కనిపించిన బలం ద్వితీయార్ధంలో మిస్ అయింది. కథ పల్లెటూరి నుంచి సిటీకి మారాక సినిమా గాడి తప్పుతుంది. మరీ తేలిగ్గా అనిపించే సీన్లతో ద్వితీయార్థాన్ని ఏదో అలా లాగించేయాలని చూశారు. బ్రహ్మాజీ కాసేపు నవ్వించినా.. ప్రథమార్ధంలో మాదిరి కామెడీ డోస్ లేకపోయింది. వెన్నెల కిషోర్.. బ్రహ్మానందం లాంటి స్టార్ కమెడియన్లు వచ్చినా.. నవ్వులు అంతగా పండలేదు. కాకపోతే ద్వితీయార్ధంలో కామెడీ డోస్ తగ్గినా.. సన్నివేశాలు మరీ విసిగించేలా అయితే లేవు. ఒక చిన్న సినిమా బృందం చేసిన ఈ ప్రయత్నం నాట్ బ్యాడ్ అని చెప్పొచ్చు. – తుపాకి.కామ్ సౌజన్యంతో...

**నటీనటులు:**

ప్రదీప్ మాచిరాజు యాంకరింగ్ లో చూపించే హుషారునే హీరోగా కూడా చూపించాడు. కామెడీ సినిమా కదా అని ఎక్కువ హడావుడి చేయకుండా.. కృష్ణ పాత్రలో సటిల్ గా నటించాడు. కామెడీ సీన్లలో ప్రదీప్ టైమింగ్ ఆకట్టుకుంది. హీరో కదా అని ఎక్కువ బిల్డప్పులివ్వకుండా.. ఒక పాత్రధారిలానే కనిపించాడు. తన సింప్లిసిటీనే కృష్ణ పాత్రకు ఆకర్షణగా నిలిచింది. దీపిక పిల్లికి ఇది తొలి చిత్రమే అయినా ఈజ్ చూపించింది. కొత్తమ్మాయిలా అనిపించలేదు. పాటల్లో మాంచి హుషారుగా డ్యాన్స్ చేసిన దీపిక.. నటన పరంగా కూడా మెప్పించింది. ప్రదీప్–దీపిక జోడీ సినిమాకు పెద్ద ప్లస్. సత్య 'మత్తు వదలరా–2' తర్వాత బాగా నవ్వించిన చిత్రమిది. ప్రథమార్ధంలో అతడి కామెడీ మేజర్ హైలైట్. గెటప్ శీను కామెడీ కూడా బాగుంది. వెన్నెల కిషోర్.. బ్రహ్మాజీ ద్వితీయార్ధంలో కొంత సేపు నవ్వించారు. హీరో తల్లి పాత్రలో రోహిణి తనకు అలవాటైన రీతిలో నటించి మెప్పించింది. మురళీధర్ గౌడ్.. మిగతా ఆర్టిస్టులు కూడా బాగా చేశారు.




# వీడిన నిద్ర.. ప్రతిపక్ష ముద్ర

(మొదటి పేజీ తరువాయి)

పోరాటానికి విజయవంతమైన ముగింపు దక్కింది. వివరాల్లోకి వెళితే..

డీసీసీబీ కాలనీకి అనుకొని ఉన్న శ్రీ భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలోని నర్సెస్ కాలనీలో రోడ్డు ఆక్రమణపై 20 రోజులుగా స్థానికులు చేస్తున్న పోరాటానికి వైకాపా నాయకులు ఆదివారం సంఘీభావం తెలిపారు. దీనిపై స్పందించిన అధికార యంత్రాంగం సోమవారం ఆక్రమించి నిర్మాణం చేసినట్టు ఆరోపణలు ఉన్న ప్రహరీని కూల్చివేశారు. ప్రహరీని కూల్చివేస్తున్న సమయంలో ఎవరూ ఫోటోలు, వీడియోలు తీయొద్దని నగరపాలక సంస్థకు చెందిన సిబ్బంది హెచ్చరించినట్టు తెలిసింది. రోడ్డు ఆక్రమించినట్టు ఆరోపణలు ఉన్న స్థలంలో నిర్మించిన ప్రహరీపై సదరు యజమానులు న్యాయస్థానం నుంచి వచ్చిన ఆదేశాలతో కూడిన హెచ్చరిక నోటీసును అంటించారు. ఈ స్థలం వ్యవహారంలో మున్సిపాలిటీ గాని, స్థానికులు గాని జోక్యం చేసుకోకూడదనేది కోర్టు ఆర్డర్. అందువల్లే స్థానిక ఎమ్మెల్యేకు, కలెక్టర్ గ్రీవెన్స్‌కు ఆ ప్రాంతవాసులు ఫిర్యాదు చేసినా ఫలితం దక్కలేదు. కానీ వైకాపా ఎప్పుడైతే స్థానికులకు మద్దతు తెలిపిందో మున్సిపాలిటీ ఈ నిర్మాణాలను కూల్చేసింది.


గత 20 రోజులుగా అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ ఫలితం లేకపోవడంతో వార్డు మాజీ మెంబర్ బిర్లంగి రామ్మోహన్ నేతృత్వంలో ఆదివారం నిరసన చేపట్టారు. దీనికి వైకాపా నేతలు సంఘీభావం ప్రకటించారు. 1984 మాస్టర్ ప్లాన్ ప్రకారం లేఅవుట్‌లో చూపించిన ఈ స్థలం ప్లాట్‌గా నిర్ధారిస్తూ ప్రహరీ నిర్మించుకోడానికి అన్ని అనుమతులూ ఇచ్చిన నగరపాలక సంస్థ అధికారులే ఇప్పుడు దీన్ని కూల్చివేయడం కచ్చితంగా సమష్టి విజయం. ఆదివారం వైకాపాతో పాటు టీడీపీ స్థానిక నాయకులు, సీపీఐ, కాంగ్రెస్, విశ్వహిందూ పరిషత్, రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం, తెలగ సంక్షేమ సంఘం స్థానికులకు సంఘీభావం తెలిపారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న అధికార పార్టీ నాయకులు నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించి ప్రహరీని తొలగించారని స్థానికులు చెబుతున్నారు.

ఆదివారం వివాదాస్పద స్థలాన్ని, అందులో నిర్మించిన ప్రహరీని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతితో పాటు శ్రీకాకుళం రూరల్ మండలం ఎంపీపీ ప్రతినిధి అంబటి శ్రీనివాస్, ఎంపీపీ గొండు రఘురాం, మాజీ ఎంపీపీ చిట్టి జనార్ధన, ఉత్తరాంధ్ర జిల్లాల వైకాపా యువజన అధ్యక్షుడు మెంటాడ స్వరూప్, బరాటం నాగేశ్వరరావు, బగ్గు అప్పారావు, సీపాన రామారావు, ఎచ్చెర్ల శ్రీధర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంవీ పద్మావతి మాట్లాడుతూ డీటీసీపీ అప్రూవడ్ లేఔట్‌లో రోడ్డుని ఆక్రమించడం ఎవరి వల్లా కాదని, అయితే అధికార పార్టీ నాయకుల అండతో రోడ్డును ఆక్రమించి ప్రహరీ నిర్మించారని ఆరోపించారు. కలెక్టర్, కమిషనర్ స్వయంగా క్షేత్రస్థాయి పరిశీలన చేసి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీలో నివాసం ఉంటున్న ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు రోడ్డుపైకి వచ్చి నిరసన కార్యక్రమం చేయాల్సిన దుస్థితికి ప్రజాప్రతినిధులు, అధికారులు తీసుకువచ్చారని ఆరోపించారు. 20 రోజులుగా సమస్యను పరిష్కరించకుండా దాటవేయడంపై వైకాపా నాయకులు మండిపడ్డారు.

## ఆక్రమణలు ఎక్కువయ్యాయి

టీడీపీ నాయకులు పీవీ రమణ మాట్లాడుతూ 15 ఏళ్లుగా కార్పొరేషన్‌లో ఎన్నికలు జరగకపోవడంతో ఆక్రమణలు ఎక్కువయ్యాయని, కొన్ని వెలుగులోకి వస్తున్నాయని, మరికొన్ని మరుగున పడుతున్నాయన్నారు. డీసీసీబీ కాలనీలో అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. అన్ని ఆధారాలతో స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోకపోవడాన్ని తప్పుపట్టారు. వివాదాస్పద స్థలాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ పరిశీలించి నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని ఆదేశించినా మున్సిపల్ అధికారుల మౌనం వహించడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు కేవీఎల్ఎస్ ఈశ్వరి మాట్లాడుతూ ప్రహరీ గోడ ఆక్రమణ వెంటనే తొలగించి ప్రభుత్వ ఆస్తులు కాపాడుతున్నామనే భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధి చౌదరి పురుషోత్తంనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులపై అక్రమ కేసుల సాకుతో ఆక్రమణదారులు బరితెగిస్తున్నారని దుయ్యబట్టారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకొని రోడ్డును పునరుద్ధరించాలని కోరారు. స్థానికులు బిందు, కృష్ణ, జొడ్డుమహంతి సంతోష్, గొప్పు సంతోష్, ఏయూఎస్ ప్రసాదరావు, భాగ్యలక్ష్మి, సనపల నర్సింగరావులతో పాటు నిరసనకు విశ్వహిందూ పరిషత్ నాయకులు ఆనందరావు, వైకాపా నాయకులు తంగి అప్పన్న, బైరి మురళి, ముంజేటి కృష్ణ, వానపల్లి రమేష్, కె.రమేష్, రఫీ, రాజు, తేజ, భరద్వాజ్, ఎం.తిరుపతిరావు తదితరులు సంఘీభావం తెలిపారు.

## అంబేద్కర్‌కు ఘన నివాళి



(సత్యంన్యూస్, సారవకోట)

సారవకోట మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, ఆదివాసి సంక్షేమ పరిస్థితి రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి, దళిత సంఘ సీనియర్ నాయకులు కోడూరు కృష్ణమూర్తి కలిసి పూలమాల వేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. మండలంలోని జడ్పీ స్కూల్, కేజీబీవీ విద్యార్థులకు అంబేద్కర్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దళిత యువజన సంఘ నాయకులు సింహాచలం, దళిత యువజన మండల అధ్యక్షులు, దాలయ్య, దళిత సంఘ నాయకులు, గొంటి ఎర్రయ్య, వాన కామేష్, ధర్మాన సోమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.



అంబేద్కర్ జయంతి కార్యక్రమం ఏఐబీసీఎఫ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భారతదేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కిల్లి వెంకట సత్యనారాయణ, వైకాపా రాష్ట్రీయకళింగ సామాజికవర్గ నేత దుంపల రామారావు, వైకాపా సీనియర్ నాయకులు పప్పల రమేష్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే అవినాష్, సాయికిరణ్, అఖిల, చైతన్య, శ్రీధర్, జైభీం యువజన నాయకులు పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం



ఆర్ట్స్ కాలేజీ రోడ్‌లోని కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌వి వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ జిజివి సుబ్రహ్మణ్యం, డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి తదితరులు మాట్లాడుతూ అంబేద్కర్ మహా విద్యావేత్త అని, భారత రాజ్యాంగ రూపకర్త అయిన ఆయన్ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం


## ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధి పాత్రికేయులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరదీసేందుకు ముఖ్య పాత్ర పోషించేది పాత్రికేయులు మాత్రమేనని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. తండ్యాంవలసలో ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ జిల్లా మహాసభల గోడపత్రికను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాత్రికేయులకు ప్రభుత్వం ఎప్పుడు సహకరిస్తుందని, మహాసభలకు ప్రభుత్వ ప్రతినిధులుగా తమ సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ ప్రతినిధులు చింతపల్లి నాగభూషణరావు, డోల అప్పన్న, తిత్తి ప్రవీణ్ కుమార్, టెంక శ్రీను, మాధవ్ ఆకుల, వి.రాము, పేడాడ హేమసుందర్, బొడ్డేపల్లి రాజేష్ పాల్గొన్నారు.




స్థానిక అంబేద్కర్ విగ్రహం జంక్షన్ వద్ద కొత్తగా కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్ట నాగరాజు నేతృత్వంలో జిల్లా హోటల్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పూలమాలలు వేసి అంబేద్కర్‌కు జయంతి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కెల్ల కిశోర్ (చిన్ని), తుంబలి సుదర్శన్ కుమార్, షన్ముఖ తదితరులు పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం

## 43వ డివిజన్‌లో అంబేద్కర్‌కు జయంతి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

43వ డివిజన్‌లోని హయాతినగరంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ బొల్ల నాగేంద్ర యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్ర యాదవ్ మాట్లాడుతూ భారతదేశాన్ని లౌకిక, గణతంత్ర, ప్రజాస్వామిక రాజ్యంగా తీర్చిదిద్దేందుకు భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ అంబేద్కర్ అనుసరించిన కార్యాచరణ మహోన్నతమైనదన్నారు. ఆర్థికవేత్త, న్యాయకోవిదుడు, అంటరానితనం, వివక్షలపై అలుపెరుగని పోరాటం చేసిన అంబేద్కర్ బాటలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు యలమంచిలి కృష్ణయాదవ్, చిన్ని శ్రీను, కొర్నాన రాము, సప్ప రమేష్, రామ్‌చరణ్ తేజ్, సబ్బి రాము, వెంకటరాజులతో పాటు జనసేన నాయకులు కె.వరప్రసాద్, అమ్మాజీ, సాయి, శివ, శేఖర్, భవానీ, శ్రీను, భానుప్రసాద్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## కూన రవికుమార్‌కు ఘనస్వాగతం



(సత్యంన్యూస్, ఆమదాలవలస)

అమెరికా పర్యటనను విజయవంతంగా ముగించుకొని ఆదివారం జిల్లాలో అడుగుపెట్టిన ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికి విశాఖపట్నం విమానాశ్రయంలో పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ నేతృత్వంలో తెలుగుదేశం నేతలు చాలామంది విశాఖపట్నం వెళ్లి ఆయనకు సాదరస్వాగతం పలికారు. గూగుల్ కార్యాలయాన్ని సందర్శించడంతో పాటు, ఎన్‌ఆర్‌ఐలు నియోజకవర్గంలో పేద కుటుంబాలను దత్తత తీసుకునే విధంగా రవికుమార్ ఒప్పించారని చంద్రశేఖర్ పేర్కొన్నారు. విశాఖపట్నం నుంచి ఆమదాలవలస వరకు రోడ్డు మార్గంలో పెద్ద ఎత్తున కార్ల కాన్వాయ్‌తో తీసుకువచ్చారు.

## లావేరు శాఖా గ్రంథాలయంలో..



(సత్యంన్యూస్, లావేరు)

లావేరు శాఖా గ్రంథాలయంలో డాక్టర్ అంబేద్కర్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రచించిన సమతా వైతాళికుడు భారతరత్న డాక్టర్ అంబేద్కర్ ఆశయాలను ప్రతి విద్యార్థి ఆదర్శవంతంగా తీసుకోవాలన్నారు. ఈయన జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

## పేరుకు సర్కారీ ఉద్యోగం.. చేసేది పార్టీ ఊడిగం!





(మొదటిపేజీ తరువాయి)

రివాజుగా మారింది. అప్పట్లో వైకాపా కార్యకర్తలను గ్రామ, వార్డు సచివాలయలకు కన్వీనర్లుగా నియమించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా బగాది శ్రీకాంత్ చినవంక గ్రామ సచివాలయ కన్వీనర్‌గా ప్రభుత్వం నియమించింది. ఆ హోదాలో ఆయన వైకాపా ఎన్నికలకు ముందు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం వంటి కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారని ఆరోపణలు, ఫిర్యాదులు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగినన్న విషయాన్ని విస్మరించి రాజకీయ ప్రసంగాలు చేయడం, రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు చేయడం ఈయన గారికి నిత్యకృత్యం. శ్రీకాంత్ అనుచిత వైఖరిపై గతంలోనే వజ్రపుకొత్తూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ హేమబాబు చౌదరి కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

### ఇప్పటికీ అదే తీరు

రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు మారాయి. దాదాపు ఏడాది క్రితం జరిగిన ఎన్నికల్లో వైకాపా ఓడిపోయి టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడింది. పలాసలోనూ వైకాపా మంత్రి సీదిరి అప్పలరాజును ఓడించి టీడీపీ నాయకురాలు గౌతు శిరీష ఎమ్మెల్యే అయ్యారు. కానీ ఇప్పటికీ ఆయన వైకాపాతోనే అంటకాగుతూ తన ఉద్యోగానికి ద్రోహం చేస్తున్నారని తెలిసింది. అతని తీరుపై అనేకమంది అందించిన సమాచారం, ఆయన చేసిన రాజకీయ ప్రసంగాలపై పత్రిక వచ్చిన వార్తల ఆధారంగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్వయంగా గత ఏడాది నవంబర్ రెండో తేదీన జిల్లా కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఉద్యోగిదా ఉండి కూడా సర్వీస్ రూల్స్‌కు భంగం కలిగిస్తూ రాజకీయాలు చేస్తున్న శ్రీకాంత్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె తన లేఖలో కోరారు. అయితే దీనిపై కూడా ఇంతవరకు స్పందన కనిపించలేదు. దీనిపై చర్యల కోసం కలెక్టర్ ఆ లేఖను డీఎంహెచ్‌వోకు పంపగా.. ఆయన దాన్ని ఏపీ శాక్స్ రాష్ట్ర కార్యాలయానికి అప్పట్లోనే పంపినట్లు తెలిసింది. బగాది శ్రీకాంత్‌కు ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీలో పైస్థాయిలో ఉన్న పరిచయాలు, సామాజిక బలమే దీనికి కారణమని స్థానికులు, తోటి ఉద్యోగులు చెబుతున్నారు. గతంలో శ్రీకాకుళం జిల్లా అదనపు డీఎంహెచ్‌వో(ఎయిడ్స్ అండ్ లెప్రసీ)గా చాన్నాళ్లు పని చేసి ప్రస్తుతం ఏపీశాక్స్ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ (బేసిక్ సర్వీసెస్ డివిజన్)గా పని చేస్తున్న వై. కామేశ్వరప్రసాద్ అండదండలు శ్రీకాంత్‌కు పుష్కలంగా ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే నిన్నటి వరకు ఏపీశాక్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్(పీడీ)గా ఉన్న ఉన్నతాధికారిణి ఈయన సామాజికవర్గానికే చెందినవారు. వీరిద్దరి అండదండలతోనే ఎన్ని ఆరోపణలు వచ్చినా.. ఎన్ని ఫిర్యాదులు వెళ్లినా జిల్లా అధికారులు శ్రీకాంత్‌పై చర్యలు తీసుకోలేకపోతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.